క్లుప్తంగా

బకాయి బిల్లులు చెల్లించండి

బొండపల్లి: ఉపాధి వేతనదారులకు బకాయి బిల్లులను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతేడాది చేసిన పనులకు సంబంధించి ఒక వారం బిల్లులు.. ఈ ఏడాదికి సంబంధించి రెండు వారాల బిల్లులు ఇంతవరకు చెల్లించలేదని పేర్కొన్నారు. ఉపాధి చట్టం ప్రకారం పని చేసిన 15 రోజుల్లోనే బిల్లులు చెల్లించాల్సి ఉన్నా.. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిత్యం ప్రధాని మోదీ జపం చేయడమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

రక్తదానం..



రక్తదానం చేస్తున్న యువకులు

గుర్ల: మండలంలోని చింతపల్లిపేటకు చెందిన చింతపల్లి పవన్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని జ్ఞాపకార్థం మృతుడి స్నేహితులు చింతపల్లిపేటలో బుధవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన 20 మందిని గరివిడి జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, సర్పంచ్ జమ్ము శ్రీదేవి, ఎన్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నేత జమ్ము అప్పలనాయుడు అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విద్యార్థులకు సురక్షిత నీరు



వాటర్‌క్యాన్‌లు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

వేపాడ: మండలంలోని ఎన్‌కేఆర్ పురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సురేశ్వరి జల వితరణ ట్రస్ట్ ద్వారా మినరల్ వాటర్ సదుపాయం కల్పించారు. ఈ మేరకు పాఠశాలకు బుధవారం క్యాన్లతో నీటిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు ఏడాది పాటు విద్యార్థులకు ఉచితంగా తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, గ్రామపెద్ద ఎస్. బలరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులోకి మార్కెట్‌యార్డు

- ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు

మెరకముడిదాం: మెరకముడిదాం, గుర్ల మండలాలకు చెందిన రైతులకు మార్కెట్‌యార్డును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. భైరిపురం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా గర్భాం గ్రామానికి చెందిన తాడ్డి చంద్రశేఖర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ఉపయోగపడేవిధంగా మార్కెట్‌యార్డును అభివృద్ధిపథంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు, కెంగువ ధనుంజయ్‌నాయుడు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు



షికారుగంజి కూడలి వద్ద తుప్పలను తీయిస్తున్న ఎస్సై రాజేష్, తదితరులు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి కూడలి నుంచి ఆర్. రామచంద్రాపురం వరకు రోడ్డుకిరువైపులా ఉన్న తుప్పలు, డొంకలను జేసీబీతో బుధవారం తొలిగించినట్లు ఎస్. భూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుప్పలు బాగా పెరిగిపోవడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనచోదకులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు తుప్పలు తొలగించినట్లు చెప్పారు.

గుంతల పూడ్చివేత



జేసీబీతో గుంతలు పూడుస్తున్న వైనం

వేపాడ: వేపాడ – సోంపురం రహదారిపై ఏర్పడిన గుంతలను ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం పూడ్చారు. చిన్న వర్షానికి కూడా గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలు పూడ్చివేయడంపై వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాకాలం తర్వాత రోడ్డు అభివృద్ధి పనులు చేపడతామని ఆర్‌అండ్‌బీ ఏఈ స్వామి తెలిపారు.

పండగలకూ పప్పన్నం లేదు..

- రేషన్ కార్డుదారులకు అందని కందిపప్పు
- కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిలిచిన సరఫరా
- దసరాకు ఎలాగూ లేదు.. కనీసం దీపావళికైనా..
- కందిపప్పు సరఫరాపై ఆశగా ఎదురుచూస్తున్న ప్రజలు

దత్తిరాజేరు:

రేషన్ డిపోల ద్వారా అందించాల్సిన నిత్యావసర సరుకులు కూడా పంపిణీ చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది.కేవలం అరకొర సరుకులు మాత్రమే డిపోల ద్వారా సరఫరా చేస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. సుమారు సంవత్సరంన్నర కూటమి పాలనపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రేషన్ వాహనాల ద్వారా ఇంటి వద్దే అన్ని నిత్యావసర సరుకులు అందేవి. కాని కూటమి అధికారం చేపట్టాక ఎన్నో సంక్షేమ పథకాలు నిలిపివేయడంతో పాటు నిత్యావసర సరుకుల పంపిణీలో కూడా కోత విధించారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీలలో 16,295 రేషన్ కార్డులున్నాయి. ఆయా కార్డుదారులకు గ్రామాల్లో ఉన్న డిపోల ద్వారా సరుకులు అందిస్తున్నారు. ప్రతి నెలా మండలంలోని లబ్ధిదారులకు 2531.15 క్వింటాళ్ల బియ్యం, 86.63 క్వింటాళ్ల పంచదార, 140.15 క్వింటాళ్ల కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే గత 15 నెలలుగా కందిపప్పు పంపిణీ చేయడం లేదు. గత ప్రభుత్వ హయాంలో కిలో కందిపప్పు 68 రూపాయలకు ఇచ్చేవారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.



కోమటిపల్లిలో బియ్యం కోసం వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారు

140 నుంచి 180 రూపాయల మధ్య ధర పలుకుతోంది. పేద, మధ్య తరగతి ప్రజలు ఇంత ధర వెచ్చించి కొనలేని పరిస్థితి. సాధారణ రోజుల్లో కాకపోయినా కనీసం పండుగ సమయాల్లోనైనా కందిపప్పు సరఫరా చేస్తే బాగుంటుందని లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు.

గతంలో ఇంటి వద్దనే..

వైఎస్సార్‌సీపీ ఐదు సంవత్సరాల పరిపాలనలో రేషన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే నిత్యావసర సరుకులు అందించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కందిపప్పు పూర్తిగా సరఫరా చేయడం లేదు. పైగా పంచదార కూడా అరకొరగానే సరఫరా చేస్తోంది. పంచదార బహిరంగ మార్కెట్‌లో కూడా డిపో ధరకే లభిస్తోంది. కందిపప్పు రాయితీపై సరఫరా చేస్తే పేద, మధ్య తరగతి ప్రజలు కనీసం పండగ రోజైనా పప్పన్నం తింటారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సమాచారం అందిస్తాం..

రేషన్ డిపోల ద్వారా కందిపప్పు సరఫరా చేసినట్టితే లబ్ధిదారులకు తప్పనిసరిగా సమాచారం ఇస్తాం. గోదాములకు స్టాకు రాగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిపోల ద్వారా సరఫరా చేస్తాం. కొద్దిరోజులుగా కందిపప్పు మాత్రం సరఫరా చేయడం లేదు.

– సత్యనారాయణ, మండల పౌరసరఫరాల అధికారి

బియ్యం ఇస్తున్నారు..

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. అప్పుడప్పుడు పంచదార పంపిణీ చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఇంటికి వచ్చి మరీ నిత్యావసర సరుకులు ఇచ్చేవారు. ప్రస్తుతం సరుకులకోసం ఇబ్బందులు తప్పడం లేదు. – అవుగడ్డి ఈశ్వరమ్మ, లబ్ధిదారు, చినకాద

కందిపప్పు ఇవ్వాలి..

బయట నిత్యావసర సరుకులు ధరలు పెరిగిపోతున్నాయి. రేషన్ డిపోల ద్వారా బియ్యం మాత్రమే కాకుండా గతంలో మాదిరిగా కందిపప్పు, వంటనూనె, రాగిపిండి, తదితర సరుకులు రాయితీపై అందించాలి. నెలా నెలా కంది పప్పు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– బాలి జయమ్మ, లబ్ధిదారు, ఆర్. రామచంద్రాపురం

మద్యం షాపుల్లో తనిఖీలు

గజపతినగరం: గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో గల 16 మద్య షాపులను బుధవారం తనిఖీ చేసినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ జె. జనార్ధనరావు తెలిపారు. మండల కేంద్రంలోని ఓ దుకాణంలో తనిఖీ చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పరీక్షల నిమిత్తం కొన్ని దుకాణాల్లో మద్యం నమూనాలు సేకరించామన్నారు. వీటని విశాఖపట్నంలోని కెమికల్ లేబరేటరీకి పంపిస్తామని తెలిపారు. గత అక్టోబర్ నుంచి ఇప్పటివరకు మద్యం షాపుల నుంచి సేకరించిన 106 మద్యం నమూనాలను.. బెల్ట్‌షాపుల్లో



గజపతినగరంలోని మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

సేకరించిన 151 కేసులకు సంబంధించి మరో 151 నమూనాలు పంపించగా.. 217 నమూనాలు నాణ్యవంతమైనవిగా తేలిందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై పి.నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌తో మద్యం నాణ్యత తనిఖీ



మొబైల్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చక్రవర్తి

చీపురుపల్లి: మద్యం దుకాణాల్లో లభిస్తున్న మద్యం నాణ్యత తనిఖీ చేసుకునేందుకు మొబైల్ యాప్‌ను తీసుకొచ్చినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ చక్రవర్తి అన్నారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలో గల 10 మద్యం దుకాణాల యజమానులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం దుకాణాల్లో లభిస్తున్న మద్యం కల్తీదా.. నాణ్యమైనదా తెలుసుకునేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. మద్యం వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చనని చెప్పారు. ఆ యాప్ ద్వారా మద్యం బాటిల్ మూతపై అతికించబడి ఉన్న హీల్‌పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ బాటిల్ ఎక్కడ తయారైంది.. ఏ డిపో నుంచి వచ్చిందనే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. మద్యం బాటిళ్లలో ఎలాంటి తేడాలున్నా.. మద్యం నాణ్యత లేదని గుర్తించినా తక్షణమే 14405 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై గిరీష్, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు నీలిమ

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన కబడ్డీ క్రీడాకారిణి బుత్తల నీలిమ సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్టు కబడ్డీ కోచ్ ఆల్తి తాతబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 11,12వ తేదీల్లో విశాఖనగరం మద్దిలపాలెం వద్ద ఉన్న ఆంధ్రా యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఆంధ్రా ఇంటర్ యూనివర్సిటీ మహిళల కబడ్డీ పోటీల్లో శ్రీరావి స్వరాజ్యం మెమోరియల్ కబడ్డీ క్లబ్ ద్వారా పాల్గొన్న నీలిమ సౌత్‌జోన్‌కు ఎంపికైందని చెప్పారు. అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 5 వరకు చెన్నైలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. నీలియ ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవీపీ రాజు, ప్రెసిడెంట్ రంగారావుదొర, సెక్రటరీ కేవీ ప్రభావతి, రావి స్వరాజ్యం కబడ్డీ క్లబ్ చైర్మన్ రావి శ్రీధర్ అభినందనలు తెలియజేశారు.



నీలిమతో కోచ్ తాతబాబు

కొత్తవలస పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ

కొత్తవలస : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, కేసు వివరాలను సీఐ షణ్ముకరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనా మాట్లాడుతూ.. భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం వైపు చూడకుండా.. సామాజిక బాధ్యతలో భాగంగా సమీప కర్మాగార యాజమాన్యాల సహాయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జామి పీఎస్‌ను..

జామి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్‌మోసాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం మహిళా సంరక్షణ పోలీసులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, ఎస్సై వీర జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్



జామి: మహిళా సంరక్షణ పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

రేపటి నుంచి క్రీడా పోటీలు

చీపురుపల్లి: ఈ నెల 17,18 తేదీల్లో బాలబాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల క్రీడా కోఆర్డినేటర్ కాపరోతు మురళీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 17, 18 తేదీల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీలకు అర్హులని తెలిపారు.

న్యాయం జరగడం లేదు

చీపురుపల్లి: ప్రభుత్వాలు మారుతున్నా రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభించడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్ని గ్రామసభలు నిర్వహిస్తున్నా నిజమైన హక్కుదారులకు న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. రైతులకు అవగాహన లేకపోవడంతో పాటు గ్రామ స్థాయిలో తగినంత సిబ్బంది లేకపోవడం, ఉన్నవారిలో అవినీతిపరులు అధికంగా ఉండడం, రాజకీయ జోక్యంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. నిజమైన హక్కుదారులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

నేడు 'కోటి సంతకాల సేకరణ'

దత్తిరాజేరు: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో గురువారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతకాల సేకరణ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్

జామి: మండలంలోని కుమరాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 17, 18 తేదీల్లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాల, బాలికలకు మండల స్థాయి ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం బాబులాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

మహాధర్నా రేపు

శృంగవరపుకోట: రాజ్యాంగం పొందుపరిచిన హక్కుల సాధన కోసం ఈనెల 17న మండల కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు ధర్మవరం గ్రామ సర్పంచ్ గాలి సన్యాసయ్య, డోల కేశవ తెలిపారు. ఈ మేరకు ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గాలి సన్యాసయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలని.. ఎస్సీ రిజర్వేషన్లు 25 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే గత ప్రభుత్వం అమలు చేసిన 28 రకాల సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బండ అప్పన్న, గుడివాడ రాజా, త్రినాథ్., కృష్ణ, రవి, సన్యాసిరావు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్

చీపురుపల్లి రూరల్(గరివిడి): విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వక్తలు సూచించారు. గరివిడి అవంతీ సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్.జె.బాలభాస్కరరావు ఆధ్వర్యంలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు అకడమిక్ చదువుతో పాటు కమ్యూనికేషన్స్, టెక్నికల్, ఆప్టిట్యూడ్ స్కిల్స్‌పై పట్టు సంపాదించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అవంతీ విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రొఫెసర్ కె.బాబులు, డాక్టర్ ఎల్.విజయలక్ష్మి, డి.దాలినాయుడు, బీకే హేమలత, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడు



చీపురుపల్లి:అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసా కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు

చీపురుపల్లి: దేశానికి అవసరమైన ఎన్నో ప్రయోగాలు చేసిన శాస్త్రవేత్తగానే కాకుండా భారత రాష్ట్రపతిగా విలువైన సేవలు అందించిన అబ్దుల్ కలాం అన్ని తరాలకు ఆదర్శప్రాయుడని శ్రీనివాసా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏడీఎస్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ.. భారత రాష్ట్రపతి అయినప్పటికీ ఎంతో సాధారణమైన జీవితాన్ని అబ్దుల్ కలాం అనుభవించారని చెప్పారు. పేద కుటుంబంలో జన్మించి దేశంలోనే ఉన్నత స్థానాన్ని చేపట్టిన గొప్ప మహనీయుడన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ కో ఆర్డినేటర్ మీసాల లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు సుబ్రహ్మణ్యం, మీసాల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అభినందన సభ

గజపతినగరం: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని జాతీయ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపికైన వారిని మరుపల్లి బాలాజీ పాలిటెక్నికల్ కళాశాలలో అభినందించారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దివ్యామృత సాయిస్వామి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పుతూ ఉన్నతమైన స్థానానికి తీసుకెళ్లడంలో వారికి వారే సాటి అని కొనియాడారు. ప్రొఫెసర్ బి. సూర్యప్రకాష్‌రావు, ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులనాయుడు, ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ముత్యాలునాయుడు, బాలాజీ విద్యాసంస్థల అధినేతలు రెడ్డి చంద్రశేఖర్, డాక్టర్ రెడ్డి పావని పాల్గొన్నారు.



గజపతినగరం: ఉత్తమ ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న దివ్యామృత సాయి స్వామి

గరివిడిలో..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): మాజీ రాష్ట్రపతి, ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను గరివిడి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వి.కన్వెన్సన్ వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పెన్షనర్ల సంఘ భవనంలో కూడా జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, సహాయ్ సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ శివుకు కాంతారావు, శంకర్, వెంకట చిన్నప్పలనాయుడు, పెన్షనర్ల సంఘ ప్రతినిధులు మోహనరావు, పైడినాయుడు, వీవీఎస్ఎస్ గుప్త, చెన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



చీపురుపల్లి రూరల్: అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలాం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు మాట్లాడుతూ..సామాన్య కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలు చవిచూసిన కలాం అనుకున్నది సాధించారన్నారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఐకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ వి.సుధీర్, లెక్చరర్లు ఆర్.శ్రీలక్ష్మి, చల్లా శ్రీనివాసరావు, సంధ్యారాణి, దివ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా అవగాహన

గుర్ల: మండలంలోని దేవునికణపాకలో గల కనకమహాలక్ష్మి బాణసంచా తయారీ కేంద్రాన్ని ఆర్డీఓ ఆశయ్య, డీఎస్పీ రాఘవులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. పనిచేస్తున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ శంకరరావు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎస్సై నారాయణరావుపాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

బొండపల్లి: ప్రభుత్వ అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయించినా, తయారు చేసినా చర్యలు తప్పవని ఎస్సై యు.మహేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అనుమతులు తీసుకున్నవారు కూడా రక్షణ చర్యలు పాటిస్తూ మందుగుండు విక్రయించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



గుర్ల: బాణసంచా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ ఆశయ్య, డీఎస్పీ రాఘవులు

సందర్శన

కొత్తవలస: మండలంలోని బలిఘట్టాం గ్రామ సమీపంలో సుమారు 57.09 ఎకరాల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్న ఎంఎస్‌ఎంఈ పార్కును కలెక్టర్ ఎం.రామసుందరరెడ్డి బుధవారం పరిశీలించారు. ముందుగా ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ.. పార్కుకు సంబంధించిన అంశాలు, అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనులు నత్తనడకన సాగుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, ఆర్ఐ షణ్ముకరావు, తదితరులు పాల్గొన్నారు.

కొండకిండాం పార్కును..

బొండపల్లి: మండలంలోని కొండకిండాం గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఏపీఐఐసీ పార్కును కలెక్టర్ ఎస్. రామసుందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కుకు కేటాయించిన 57 ఎకరాల భూమికి సంబంధించిన వివరాలను సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఆయన వెంట తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, రెవెన్యూ సిబ్బందితో పాటు ఏపీఐఐసీ డీజీఎం జయచంద్ర ఉన్నారు.



బొండపల్లి: కొండకిండాంలో పార్కు పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి